

## అథాతో చల్ల జిజ్ఞాసా, అథాతో చల్లజిజ్ఞాసా
## తేక గొప్పగొప్ప హైలాసులు, గొప్పగొప్ప హైలాసులు!

అయ్యా వేయ్యేల, మొన్నీ మధ్య నా బైస్కోపదేవిఁటి చెప్మా--అందులో ఆ యొక్క నారదులవారూ ముక్కోటి దేవతలూ విష్ణుమూర్తితో అన్నట్లుగా చల్లకొచ్చి ముంత దాచనేల? వచ్చినపని చెబుతా....చెబుతా చెబుతా యావన్నారూ నారదులవారికి విష్ణుమూర్తి ఇంటికి చల్లకెళ్ళడం రివాజా? అంటారా. చెబుతా, చెబుతా. ఇది చాలా లోతైన విషయం లేదా పై వాడి గొడవ కాబట్టి ఎత్తయిన విషయం అనుకుందాం. తొందరపడకండి. ఇందులో ఓ పెద్ద ప్రశ్నోపనిషత్తు ఉంది. విష్ణుమూర్తికి చల్ల పొయ్యడం రివాజా, విష్ణువు దగ్గరే కొనడం రివాజా? ఇలా ఎన్నో ముందు మనం తేల్చుకొనవలసింది. నారదుల వారికి చల్లకోసం విష్ణుమూర్తి ఇంటికి వెళ్ళడం రివాజా? మరొహరింటి కెళ్ళడం రివాజా అనేది

కాదు. దానికేముంది, రోజూ రివాజుగా ఆయన చిక్కటి మజ్జిగ పోస్తానంటే ఈయన రివాజుగానే వెళ్ళి తెచ్చుకోవచ్చు. బ్రాహ్మడా ఈపూట చల్లకుండ పిల్లి పడదోసినట్టుందయ్యా అనో, తోడుకోలేదనో, లేదా యాదమరచి పొరుగింటి చల్ల అనుకుని నేనే దాహం పుచ్చేసుకున్నానయ్యా అనో ఆయన చెబితే అప్పుడు మరో ఇంటికి పోతాడు. లేదా రోజు విడిచి రోజు ఒక్కొక్క ఇంటికో, రోజూ ఓ కొంపకో పోతాడు. దాని దేముంది.

ఆయన బ్రహ్మచారి గదా? కొంపలో తోడా? పాడా? అంచేత ఎక్కడో అక్కడ ముంతెడు చల్ల తెచ్చుకోక తప్పదు. ఇహ పోతే అసలు నారదులదారు ఆయొక్క దేవతలూ మరి దేవతలు గదా--అనగా మానవులు కారు గదా. మరి అట్టివారు వణ్ణంలో చల్లపోసుకుంటారా? దాని కోసం ఒహరింటికి ముంత పట్టుకు వెళ్తారా అనేది వేరే విషయం అది అలా వుంచండి, అలా అంటే అక్కడ కాదు. ఇంకొంచెం అసుంఠా వుంచండి. అసలు నిజానికి ముంతపట్టుకు ఒహరింటి కెళ్ళక్కరలేదు నన్నడిగితే. అందరికీ కలిపి కామన్ ధేను వుండనే ఉంది గదా! కావలసినంత పాడి.

మనక్కావలసింది నారదుడూ వాళ్ళూ చల్లపోసుకుంటారా అనేదే. అంచేత అథాతో చల్ల జిజ్ఞాసా....ఏం ఎందుకు పోసుకోరు? పోసుకోకపోతే వేడిచెయ్యదూ? అదీన్నీగాక చల్ల 'దివ్య--పానీయానికి' విరుగుడు అని మన క్కూడా అనుభవం మీద తెలిసిందే. వాళ్ళు పుచ్చుకునేది 'అదే' గదండి. నా మొహం గాకపోతే దీనికి పెద్ద లాజిక్కేమిటి? ఎంత దేవతలయినా చారో పులుసో అఘోరించాక, చివర్ని మజ్జిగోసుకోకుండా యలా లేచి పోతారు బంతిలోంచి? అసలు వారంతా వణ్ణం తింఛారంఛారా? అని గదూ మీ సందేహం? ఎందుకు తిన్రు? తింఛారు. కంచాలక్కంచాలు లాగేస్తారుష ఒహ పట్టుబడితే. దీనికి దాఖలాలు ఎక్కడో ఎందుకు? ఇందాక చెప్పిన బైస్కోపులోనే ఇమిడ్చి పారేశారు. మళ్ళీ మన్లాంటివాళ్ళు ఎన్నడూ చావకుండా దేవత లందరినీ అన్నపానాలు లేకుండా మాడ్చిపారెయ్యవలసిందని ఒహ విలువైన ముక్క వుంది. ఇంతకన్నింకేం దాఖలాకావాలి దేవతలకీ తిండీ తిప్పలూ వుండేవనటానికంట. అసలు మనవూ( లేదా-- మే(వూ( వాళ్ళూ ఒకళ్ళవే( గద. వారు వేలుపులైన వీరు తెర వేలుపులు. అలాక్కాదు,వారు యన్నటికిన్ని మానవులు కారు. మనలా తిండీతిప్పలూ ఉండవు అంటారా? అనండి.

వాళ్ళు మానవులు కాకపోయినా--మనం దేవతలం గదా "దిగిరాను దిగిరాను దివినుండి భువికి"అవటాంటే అయితే పట్టు నేనే పైకి వస్తా అన్నాం "ఖగపతి యమృతము తేగా భుగభుగమని పొంగి చుక్క భూమిని రాలగా అది పొగచుట్టయ్ జన్మించగ...". అన్నాడు కవి. మనం అవి కాల్చి వారి పాయాలోకి వెళ్ళినందువల్ల అంతా యాకమై వూరుకున్నాం. అందువల్ల మన అలవాట్లూ, చుట్టలూ వారికీ వుండి తీరాలి. లేకపోతే అబ్బి తీరాలి. పాటలు డైలాగుస్థాయికి దిగొచ్చినట్లు.

ఇహనివన్నీ కాదు కూడదని కొట్టి పారేసినప్పటికిన్నీ, నారదుల వారికి చల్ల--ముంతల సామెతలు తెలీవని నిర్ధారణగా చెప్పిందికి వీల్లేదు. యావంటారా--ఆయన త్రికాలజ్ఞుడు. ఆ యొక్క విష్ణుమూర్తివారు రేపు గాకపోతే 'మాపైనా' కృష్ణావతారం ఎత్తి గొల్లవారింట నల్లపిల్లవాడై 'చల్లటి' నవ్వులు నవ్వుతూ తిరుగుతాడని ఆయనకి ముందే తెలుసు. ఉండబట్టలేక , అందులో గుట్టు సూచనగా రామావతారం ముందరే చెప్పాలన్న ఉబలాటంకొద్దీ, నువ్వు చేయదలచుకున్న పన్లన్నీ నాకు తెలుసు లేవోయ్ అని గడుసుగా తెలియజెప్పాలన్న ఆశకొద్దీ నారదులవారు ఆ సామెత వేసుంటారు కృష్ణావతారంలో. మరి గొల్లభావలంతా యశోదమ్మ ఇంటికి చలకొచ్చి అక్కడ నల్లటి అల్లరి పిల్లడిని చూసి, తల్లి చల్ల తెచ్చి పోసేలోగా ఈ పిల్లాడు ఈ ముంత బద్దలుకొడితే ఏమి జేతుము దైవమా అని అది దాస్తారు గదా. ఇదీ తాత్పర్యం.

అయ్యా! చూశారా తీగ లాగితే డొంకంతా కదుల్తుంది. మీరు ఒక్కడైలాగు ముక్క అడిగితే ఇంత భాగవతం బయటపడింది. మరి ముక్కలనుకున్నారా? మజాకా అనుకున్నారా? తెలుగు సినిమాలు--ముఖ్యంగా డైలాగులు థాట్ ప్రవోకింగ్ కావన్న చెవలాయ ఎవడవయ్యా అంట. ఇంత విద్వత్శ్లోషిని అది రెచ్చగొట్టిందే! ఇంత ఎడ్యుకేషను ఇచ్చిందే -అసలు మాట్లాడ్డమే ఎడ్యుకేషననుకోండి. నాతో యవడు మాటాడినా, నేనెవడితో మాటాడినా. ఏవిటో డిష్కషనంతా హైక్లాను విషయాలమీదనే నడుస్తుంది. ఎప్పుడూ తారాపథంలోనే వుంటుంది. ఏం చేస్తాం అదలా ఉంచండి. నేనిక్కడ లేకపోయినా ఈ యొక్క విలువైన ముక్క పట్టుకు వేళ్ళాడితే పామరుల క్కూడా ఇంత పాండిచ్చెవూరంగున అబ్బి వూరుకునేదే.

ఇది కానుకోక డైలాగుల్ని డైలాగులాడిపోనుకుంటున్నారు పండితజనం. ఒక్కొక్క డైలాగుని ఎంతెంతమంది ఎన్నెన్ని విధాల తెగలాగి చూస్తున్నారో వీళ్ళకసలేవేనా తెలుసా అంట. ఇలా పదిమంది పరిపరివిధాల కాచి వడబోసి వస్త్రకాళితం చేసిన ముక్కలు కాబట్టే--సినిమాలు కొత్తవేనా, కథలు మారినా డైలాగుముక్కలు యవళ్ళూ మార్చ సాహసించరు. ఏదో కాస్త వ్యాఖ్యానించి చకచక పది పుస్తకాలు రాసి అమ్ముకొని పేరూ డబ్బూ బావుకుందామని కూచుని అఘమేఘంతోనే లైఫంతా అయిపోయేట్టుందని వాపోయిన పెద్దమనిషిని ఇటుకేసొదిల్తే ఒక్క బుక్కు కూడా పూర్తిచెయ్యలేడు. నిజానికి లావుపాటి బుక్కుపాటి వ్యాఖ్యానాలు ఒరిజినల్ రైటరే రాసి పేర్చేస్తాడు డైలాగు కెడాపెడ. అయినప్పటికిన్నీ ఇంకా ఎంతో ఉంటుందది రాసి రాశిపోనుకుందికి.

అబ్బెబ్బె. అన్నీ అలా టీకాతాత్పర్యాలతో బట్టీపట్టి చెప్పినట్టు రాసుకుంటా వనుకుంటున్నారా? యంతమాట. అసలామాటకొస్తే టీకాతాత్పర్యాలు రాస్తామని ప్రకటించుక్కూచున్నవాళ్ళే కొన్ని పెద్దమాటల గుట్టు మాటుపెట్టి దాచెయ్యడం లేదూ? అలాగే మేవు(న్నూ, అవసరమైన విషయాలు ఛస్తే బయటపెట్టం. అలాచేస్తే కథాగిపోదూ. ఒక్కటిక్కెట్టు శాల్తీ కిందపడిపోతే రైలాగాలని గొలుసు లాగినట్టు. వెధవది ఒక్క డైలాగు ముక్కకోసం అని కథని ఆపి పారేస్తాం(వుటండీ--ఏవో పాటలూ, కామిడీ డాన్సులూ పెట్టదలచుకున్నప్పుడు తప్పా? మచ్చుక్కావాలంటే మన పిక్చరులో ఓ సీను చూడండి. హీరోయిను హాల్లో కూచుని పేపరు చదువుతోంది. కారు డ్రైవరొచ్చి అటూ ఇటూ తిరిగి (ఈవిణ్ణి బలాత్కరిస్తాడా? రించకపోయినా ముగుడు కిటికీ చిల్లుల్లోంచి చూసి ఆశ్చర్యపడి లేచి చట్ట విరిగేలా అపోహపడతాడా? 20వ రీలుదాకా సస్పెన్సు)--ఏవన్నానూ--అదే అటూ ఇటూ తిరిగి బీరువామీద అగ్గిపెట్టె తీసుకు చక్కాపోతాడు బీడీ కాల్చుకుందామని. హీరోయిను చూస్తుంది. నవ్వుకుంటుంది క్లోజప్పులో--ఆ నవ్వుమీంచి కార్మికులు--శ్రమపడి పని చేసి అలసి బీడి కాల్చుకోవడం కమామీషు--ఒక డాన్సు--అంతా ఇమాజినేషనన్నమాట--లాగెయ్యొచ్చు మనకి డబ్బు సందర్భపడితే : ప్రోగ్రెసివుగా ఉంటుంది కూడా--ఏం? ఆ డ్రైవరు అలా అగ్గిపెట్టె పట్టుకుపోతాడా? తరువాత షాటులో మదరిల్లా వస్తుంది--హాల్లో అగ్గిపెట్టె వెతుకుతుంది. కనపడదు....ఆవిడ కెందుకంటారా....

మీది బలే చురుకైన బుద్ధిన్నండీ. ఇట్టే పట్టుగున్నారు లొనుగు....దాన్ని కమ్ముకుందికి ఓ డైలాగు పెడదాం లెండి వంటింటిలో అగ్గిపెట్టె పోయిందీ అని. ఇలాటి వెన్ని పెడితే అన్ని మంచిది. ఎందుకంటే మనం పెట్టుకున్న కవిగారు బిజీ రైటరు. చూడండి. ధర్మరాజు లాటివాడు. అందరికీ ఒకే డైలాగులు రాసిస్తాడు. అందికే అజ్ఞాతవాసం చేస్తాడనుకోండి. ....ఆయనకి తీరిక లేనందువల్లా, దొరక్కా, చాలామంది ప్రొడ్యుసర్ డైరెక్టర్లం మేమే రాసేసుకుంటున్నాం ఆపద్ధర్మపు డైలాగులన్నీ--ఈమధ్య ఒక ఎగ్రిమెంటు కూడా అయింది. పిక్చరులో మొత్తం డైలాగుల్లో కవిగారు స్వహస్తంతోగాని, శిష్యహస్తంతోగాని వ్రాయించి ఇచ్చినవి తీసేసి మిగతావి--అనగా మేము రాసుకున్నవాటికి మాట కణా చొప్పున లెక్కకట్టి వారి ఫీజులో మినహాయిస్తున్నాం. ఇప్పుడు మన పిక్చరుకి ఎగ్రిమెంటులో ఇంకో క్లాజుకూడా ఉంది డిటో డైలాగుల గురించి. అబ్బెబ్బే డిటో డైలాగులంటే క్రితం పిక్చరులో రాసినవాటికి డిటో అని కాదు. అవిఎలాగా ఉండేవే. ఈ పిక్చర్లోనే రెండేసి మార్లొచ్చేవి అంటే -"అమ్మమ్మా నాక్కొంచెం చింతకాయ పచ్చడి వెయ్యి -క్కొంచెం చింతకాయ పచ్చడి వెయ్యి"అనీ. "నే నింతావకాయ వేసుకోను సుశీ, నే నింతావకాయ వేసుకోను" అనీ ఉంటాయే అవన్నమాట. ఇపుడవి ఫాషను లెండి. మందాంటో మూడేసి సార్లొస్తాయి. "నీ రాకకోసం నే నెదురు చూస్తున్నాను. చూస్తున్నాను"ఇలా వుంటాయన్నమాట. ఈ రకం వాటన్నిటికీ ఒకటే డైలాగు చొప్పున లెక్కకడతామనీ, ఇవీ కవిగారికి టైములేక పాటువేళకి డైలాగు రాక (బట్వాడా కాక లెండి) మనవేఁ రాసుకునే లేదా ఆర్టిస్టులు సన్నయిచేసే డైలాగులకి రేటు కట్టి ఫీజులు మినహాయిస్తాం. తరవాత్తరువాత వారు, ఫలానా గిరీశంగారు నా డైలాగులకి ఇవ్వవలసిన నాలుగువేలు ఇంతవరకూ ఇవ్వలేదు అని చెప్పుకున్నప్పుడు-అందులో ఇవి మినహాయించి మరీ మాటాడుకోవాలన్నమాట.

ఇంతకీ చెప్పొచ్చిం దేవిటి చెప్మా? అగ్గిపెట్టె సీను గదూ! అదే హీరోయిను హాల్లో కూచుంటుంది. డ్రైవరు బీరువామీద అగ్గిపెట్టె పట్టుకుపోయి బీడీకాల్చి తెచ్చి బల్లమీద పడేసి పోతాడు. హాల్లోకి మదరిల్లా--అనగా అత్తగారు--అదే సూర్యకాంతంలెండి వస్తుంది. ఇందాక ఇక్కడ అగ్గిపెట్టె పెట్టాను ఏదీ అంటూ--ఏవంటారు? సహజత్వం లేదంటారా? దానికేముంది ఆవిడకి చిన్నప్పటినుంచీ అగ్గిపెట్టెలు హాల్లో బీరువాలవీద దాచడం

అలవాటని ముందురీళ్ళలో ఎస్టాబ్లిష్ చేస్తాం. కాపోతే ఫ్లాష్‌బాక్ పెడతాం--గ్లేమరు కూడాను. కాదంటారా. చుట్టకాల్చుకుంది కొచ్చినట్టు--అయి మీన్ మదరిల్లా కదూ. పోని ఫాదరిల్లా చేసేదాం లెండి--మీ ఇష్టం.మీ లాజిక్కు మీద నాకెంచేతో ఒక గురి పడిపోయింది. ఏం, సరే ఫాదరిల్లా, మామగారు, మీసాలూ కళ్ళజోడు కేసు. వోవరుకోటు, ఆయన వస్తాడు చుట్టపట్టుకుని. వేరీజ్ ద మాచ్ బాక్స్? అగ్గిపెట్టేది? ఇంగ్లీషు డైలాగులు పడాల్లెండి....పక్కనే తెలుగు పడేస్తే సరి.ఏది? అగ్గిపెట్టె వెతుకుతాడు బీరువామీద. క్లోజ్ షాట్ -అగ్గిపెట్టె లేదు, ఆయన వేలు పక్క తేలు కుడుతుందా.... సస్పెన్స్....కోడలు మిడ్‌షాట్ . కట్. మావగారి క్లోజప్. గి్రున తిరుగుతాడు ఏది అగ్గిపెట్టె అని గర్జించి--ఆడియన్స్ హడిలి పోతార్లెండి. ఐ కెన్ సీ యిట్. జవాబుగా అగ్గిపెట్టె బల్లమీద ఉంటుంది. క్లోజ్ షాట్. మావగారు కోడల్ని చూస్తాడు. ఫుల్ షాట్ ట్రాలీ బాక్ వర్డ్ .... ఏదమ్మా అగ్గిపెట్టె అంటాడు విద్వేషపూరిత నయనాలతో, అర్ వాటెవరిటీజ్.

కోడలు లేస్తుంది, జారినపైట సవరించుకుంటుంది.

"మాటడవేం?" అని మావగారికంఠం. ఫ్రేములో ఆయనుండడు లెండి. షాట్‌లు ఈవిడ మీద తీస్తాం. ఆవిడ ముందరే చెప్పింది నన్ను బుక్ చేసుకుంటే, కాంట్రాస్టు కోసం తప్ప తన ఫ్రేములో ఇంకో ఆరిస్టు ఉండకూడదని. మిగతావాళ్ళ డైలాగులు అవీ అవుట్ ఫీల్డులోంచి రావాలి. ఈవిడ రియాక్షను ఇస్తుందన్నమాట.

"మాటాడవేం?" మావగారి కంఠం.

"అదికాదు మావగారు?" అంటుంది కోడలు.

"ఇంత నీచానికొడిగడతావనుకోలేదు."

"మావగారూ! తొందర పడుతున్నారు."అంటుంది కోడలు దీనంగా.

"తొందర ఇప్పుడేం. ఎప్పుడో పడ్డాను. నిన్నీ యింటి కోడల్ని చేసుకోడమే తొంతరపని."

"మావగారు! ఇది న్యాయం కాదు....కాదు."

"ఏది న్యాయమో నువ్వు నాకు చెప్పనక్కరలేదు. నీకీ యింట్లో ఏం తక్కువైందని ఇలాటి దొంగబుద్ధులు?"

"మావగారూ!'

"అవును. ఇందాక బీరువామీద అగ్గిపెట్టె ఇంతలో ఎక్కడికి పోయింది....ఛీ?'

"మావగారూ నామాట వినండి....వినండి" బల్లమీది అగ్గిపెట్టె క్లోజప్,సస్పెన్స్.

"పో ఈ యింటోంచి. అగ్గిపెట్టె దొంగతనంచేసి పైగా....నీ మాట వినాలేం--'

"అదిగాదు మావగారూ.... మావగారూ"

"ఏదికాదు. అసలు నువ్వీ యింట్లోంచి పో. ఈ గుమ్మం తొక్కకు"

"మావగారూ!"క్లోజప్.

"మావాడికి మరో పెళ్ళి చేస్తాను. మరో మరో పెళ్ళి పెళ్ళి చేస్తా చేస్తా ."

కట్. ఆ హాలు తాలూకు మొగలీ అజాం మార్కు కిటికీ చిల్లుల్లోంచి రఘు చూస్తాడు ఈ దృశ్యాన్ని.అతని హృదయం దహించుకు పోతుంది....హెవీ డైలాగులు వస్తాయి లెండి....ఛీ....బాబాయి ఎంత అఘాయిత్యానికి వడిగట్టాడు? తనకి మరో మనువు చేస్తాడట. తనభార్యను...అబ్బ....ఛీఛీ....తాను యింటలేనివేళ ఇద్దరూ ఇలా కులుకుతున్నారన్నమాట. అతను మెలితిరిగిపోతాడు. నేపథ్యప్పాట....కట్. ఇంట్లో--

"మామగారూ" అంటూ కోడలు ఆయనకాళ్ళమీద పడుతుంది. లేచి మళ్ళీ కాళ్ళమీద పడుతుంది.

"ఛీ పో. నేను నిన్ను క్షమించలేను. నేను నిన్ను క్షమించలేను" అంటుంది మావగారి కంఠం. పాదంపైన--

"మామగారూ నే చెప్పేది వినండి. నా భర్తకు నన్ను దూరం చెయ్యకండి, చెయ్యకండి".

మావగారు ఆమెను ఒక్క తాపు తన్ని తోసి తలుపేసి వంటింట్లోకి పోతాడు "ఔనే అగ్గిపెట్టెక్కడే"అంటూ, లోపలెవరూ? సూర్యకాంతం. "దాన్ని తన్ని తగిలేశారు. ఇప్పుడు

వంటెవర్తి చేస్తుంది. అంట్లెవరు తోముతారు" అంటుంది. ఫాదరిల్లా నవ్వుతాడు. "నేనే మైడియర్.... డోం టెటాల్ ఫియర్...." అంటూ డూయెట్ తొలి చరణం ఆరంభించి డాన్స్ చేస్తాడు. కామెడీ డ్యూయెట్ అన్నమాట. చూస్కోండి. రంగారావు సూర్యకాంతం గుమ్మడి సూర్యకాంతం న్యూయష్టు కాంబినేషన్ డ్యూయట్. దీనిమీద యింటర్ కట్ చేస్తూ--అనగా ఇదో చరణం--అదో చరణంగా అటు హీరోహీరోయిన్‌లకి నేపరుప్పాట....ఎపిడీసార్. ఎలా వుంది?

ఇంతకీ చెప్పొచ్చింది అగ్గిపెట్టె సీను కదూ? అక్కడ డైలాగులు చూశారా? ఎంత గంభీరంగా ఆలోచనలు రెచ్చగొట్టేవిగా ఉన్నాయో!"అదిగోనయ్యా నీ అగ్గిపెట్టె బల్లమీద. అదేం....కనబట్టంలా?" అనేసిందనుకోండి కోడలు. గుట్టు బయట పడిపోలా?కొంప మునిగిపోలా? ఎంతడ్రామా మిస్సయిపోతాం. దానిమీద కథంతా ఆధారపడి వుంది. హీరోతూర్పుకీ, హీరోయిన్ పడమటికీ పోతారు. పోయి పోయి మళ్ళీ 260వ అక్షాంశం దగ్గిరే కలుసుకుంటారు....

ఎలా వున్నాయి డైలాగులు? నేనే టెంపరరీగా కంపోజు చేశాలెండి. ఇదే ఫైనలు కూడాను. కావాలంటే నేనే మొత్తం రాస్తా లెండి. దానికేం ఆల్వేజ్ ఎట్ యువర్ సర్వీస్....

హలో! హలో హల్లో....వింటున్నారా!....డామిడ్ ఫోను పడేసి పోయాడే. వీడి తస్సాదియ్యా! వీడి తస్సాదియ్యా! డామిట్....డామిట్....మిట్....ట్....

